
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 14 అక్టోబరు 2024



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.148	230	260
సూర్యాపేట	రూ.135	200	230
నల్లగొండ	రూ.131	190	218

ఉష్ణోగ్రత గరిష్ఠం 30.5 । కనిష్ఠం 23.4

దసరాకు ఎగిరిన జాతీయ పతాకం

ఆనవాయితీ పాటిస్తున్న బేగంపేట గ్రామస్థులు



బేగంపేటలో జాతీయపతాకాన్ని ఎగురవేసిన గ్రామస్థులు

రాజాపేట, అక్టోబరు 13: స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ప్రతీ దసరాకు జాతీయపతాకాన్ని ఎగురవేసే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామస్థులు. శనివారం దసరా సందర్భంగా గ్రామస్థులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటుకున్నారు. దేశానికి స్వాతంత్ర్యం రాగానే మొదటిసారిగా బేగంపేట గ్రామంలో జాతీయపతాకాన్ని స్థానిక నాయకులు బద్ధం నర్సిరెడ్డి, జిట్టా రామ్‌చంద్రరెడ్డి, చిగుర్ల మల్లయ్య, గుర్రం నర్సయ్య తదితరులు ఎగురవేశారు. నాటి నుంచి ఇది ఆనవాయితీగా వస్తోంది. ఈ దసరాకు గ్రామానికి చెందిన నేత కార్మికుడు బోగ హనుమంతు మూడు రంగుల జెండాను నేయగా, జాతీయ పతాకాన్ని, అందులో ధర్మ చక్రాన్ని మేర కిష్టయ్య కుట్టారు. అనంతరం డప్పుచప్పుళ్ల నడుమ గ్రామ నడిబొడ్డున ఉన్న గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని అక్కడి గద్దెపై జాతీయపతాకాన్ని ఎగురవేశారు. ఇక్కడ నిరంతరంగా జాతీయపతాకం ఎగురుతూనే ఉంటుంది. పతాకావిష్కరణ అనంతరం గ్రామస్థులు ఊరి బయట ఉన్న జమ్మిచెట్టు వద్దకు వెళ్లి పూజల్లో పాల్గొని పాలపిట్టను దర్శించుకున్నారు.

దసరాకు ఆ ఊరు దూరం



మోత్కూరు, అక్టోబరు 13: రాష్ట్ర ప్రజలకు బతుకమ్మ, దసరా పెద్ద పండుగ. దసరా పండుగ నిర్వహించని ఊరంటూ ఉండదు. కానీ, అడ్డగూడూరు మండలం బొడ్డుగూడెం గ్రామం మాత్రం దసరా వేడుకలకు దూరంగా ఉంటుంది. పూర్వ రోజుల్లో దసరా పండుగ రోజు కంకణం కట్టే సమయంలో ఘర్షణ పడి ఇక్కడ దాడులు చేసుకునేవారు. పాత కక్షలు తీర్చుకునేందుకు ఈ సందర్భాన్ని ఎంచుకునేవారు. దాడుల్లో పలువురి తలలు పగిలేవి.

మృతి చెందిన సందర్భాలూ ఉన్నాయి. బొడ్డుగూడెం 1964లో అడ్డగూడూరు పంచాయతీ పరిధిలో ఉండేది. ఆ ఏడాది గ్రామంలో దసరా వేడుకల సందర్భంగా జమ్మి చెట్టు వద్ద రెండు వర్గాలు పరస్పరం దాడి చేసుకున్నాయి. ఆ దాడుల్లో ఒకరు మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ఇరు వర్గాలపై కేసులు కూడా నమోదయ్యాయి. దీంతో గ్రామ పెద్దలు దసరా వేడుకలకు దూరంగా ఉండాలని నాడు నిర్ణయించుకున్నారు. దీంతో అప్పటి నుంచి గ్రామంలో దసరా వేడుకలు లేవు. ఆ గ్రామానికి చెందిన కొమ్ము పాపయ్య ఎమ్మెల్యే ఉన్న కాలంలో ఒక ఏడాది పోలీస్ బందోబస్తుతో దసరా నిర్వహించినట్టు గ్రామస్థులు తెలిపారు. ఆ తర్వాత ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయంతో వేడుకలు నిర్వహించడం లేదని గ్రామ పెద్దలు తెలిపారు. అయితే గ్రామంలో సామూహిక వేడుకలు మాత్రమే జరుగవు. గ్రామస్థులు ఎవరి ఇంటికి వారు పరిమితమై పండుగ విందులు చేసుకుంటారు కానీ, పురోహితుడు రాడు, పూజలు చేయరు, కంకణాలు కట్టరు, జమ్మి చెట్టు వద్దకు వెళ్లరు. కొందరు యువకులు జమ్మిచెట్టు వద్దకు వెళ్లి తెచ్చిన జమ్మి ఆకును పంచుకొని కేవలం దసరా శుభాకాంక్షలు మాత్రం చెబుతుంటారు. ఇదీ ఈ గ్రామ పరిస్థితి.

బతుకమ్మ పేర్చిన మహిళలకు బంగారు కానుకలు



మొదటి బహుమతి ఒక గ్రాము బంగారం ఇస్తున్న కర్నాటి వీరనాగిరెడ్డి

హుజూర్‌నగర్, అక్టోబరు 13: ఆ గ్రామంలో బతుకమ్మ పేర్చిన మహిళలకు ఓ నేత బంగారు కానుకలు అందజేశారు. హుజూర్‌నగర్ మండల పరిధిలోని అమరవరం గ్రామంలో దసరా సందర్భంగా బతుకమ్మ పేర్చిన మహిళలకు స్థానిక కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కర్నాటి వీరనాగిరెడ్డి బంగారు కానుకలు అందించారు. అమరవరం గ్రామంలో శివ గణేష్ ఉత్సవ కమిటీ, నాంపల్లి యూత్ ఆధ్వర్యంలో రెండు చోట్ల బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమరవరం గ్రామంలోని శివాలయం వద్ద, బస్టాండ్ సెంటర్‌లో అమ్మవారి విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆఖరి రోజు బతుకమ్మ పేర్చిన 310 మంది మహిళలకు పట్టు చీరలు, వివిధ రకాల వస్తువులు అందజేశారు. వీటితో పాటు రెండు మండపాల వద్ద బతుకమ్మలను అందంగా, ఆకర్షణీయంగా, సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా పేర్చిన బతుకమ్మలకు బంగారు కానుకలు బహుమతులుగా అందించారు. రెండు చోట్ల మొదటి బహుమతి కింద ఒక గ్రాము బంగారం, ద్వితీయ బహుమతిగా 0.5గ్రాము బంగారం, తృతీయ బహుమతిగా మూడు తులాల వెండి, నాలుగో బహుమతిగా రెండు తులాల వెండి, ఐదో బహుమతిగా 1.5 తులాల వెండి వస్తువులు బహుమతులుగా కర్నాటి వీరనాగిరెడ్డి అందజేశారు. మొత్తంగా సుమారు ఐదు లక్షల రూపాయల విలువైన బహుమతులు అందజేశారు.

సరదాగా దసరా సంబురం



» ఆలయాల్లో పోటెత్తిన భక్తులు
» జమ్మి చెట్టుకు పూజలు
» పాలపిట్టను దర్శించుకొని పరవశించిన భక్తులు

నల్లగొండ కల్చరల్, అక్టోబరు 13: దసరా పండుగను జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఘనంగా నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే సమీపంలోని ఆలయాలకు చేరుకుని ఇష్ట దైవాన్ని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, పూజల్లో పాల్గొన్నారు. ఆలయాలను నిర్వాహకులు మామిడాకులు, పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. దుకాణదారులు, వృత్తి కార్మికులు వారివారి పనిముట్లకు ఆయుధ పూజలు చేశారు. ఉదయం పూట పూజలతో గడిపిన ప్రజలు మధ్యాహ్నం పిండివంటలు, మాసంతో విందు భోజనాన్ని ఆరగించారు. సాయంత్రం ఆలయాలకు చేరుకుని శమీపూజల్లో పాల్గొన్నారు. అనంతరం పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. జమ్మి చెట్టుకు కోర్కెలతో కూడిన చీటీలు కట్టి ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు కలగాలని వేడుకున్నారు. పలుచోట్ల రావణ దహనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు జై శ్రీరామ్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఆర్య సమాజ మందిరాల్లో యజ్ఞం, ఆయుధపూజ, ధ్వజారోహణ నిర్వహించి, పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర వైభవంగా సాగింది.



ఆయుధ పూజల్లో పాల్గొన్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్ దంపతులు

వైభవంగా అమ్మవారి శోభాయాత్ర



నల్లగొండలో దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం

నవరాత్రోత్సవాల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చి విశేష పూజలందుకున్న దుర్గామాత విగ్రహాలకు ఆదివారం నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. పట్టణాల్లోని పలు దేవాలయాల్లో, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారిని తొమ్మిది రోజులపాటు భవానీ మాలధారులు, భక్తులు కొలిచారు. విజయదశమి రోజు అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. నవరాత్రులు ముగియడంతో ఆదివారం అమ్మవారిని ప్రత్యేక వాహనాల్లో అధిష్ఠింపజేసి డప్పు చప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించారు. దారిపొడవున భక్తులు నిరాజనాలు పలికగా, చివరగా చెరువుల్లో నిమజ్జనం చేసి అమ్మవారికి వీడ్కోలు పలికారు. అంతకు ముందే ఆలయాలు, మండపాల్లో అమ్మవారి లడ్డు, వస్త్రాలకు వేలం నిర్వహించగా, భక్తులు పోటీపడి పాల్గొని వాటిని దక్కించుకున్నారు.

ఆర్టీసీకి దసరా బొనాంజా



» పండుగ రోజు ఆర్టీసీకి రూ.88లక్షలకు పైగా ఆదాయం

నల్లగొండ/రామగిరి, కోదాడ, అక్టోబరు 13: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీకి, ఎక్సైజ్‌శాఖకు భారీ ఆదాయం సమకూరింది. పండుగకు ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులతో పాటు ఎక్స్‌ప్రెస్‌లు, డీలక్స్‌లు, మినీడీలక్స్‌లు పెద్ద సంఖ్యలో నడిపింది. మొత్తం రీజియన్ పరిధిలో 482కు పైగా బస్సులు వివిధ గ్రామాలు, పట్టణాలకు నడిచాయి. దీంతో దసరా ఒక్కరోజు భారీ మొత్తంలో ఆదాయం సమకూరింది. నల్లగొండ రీజియన్ పరిధిలో ఉమ్మడి జిల్లాలో ఏడు బస్ డిపోలు ఉన్నాయి.

ఈ డిపోల నుంచి సుమా రు 2లక్షల కి.మీలకు పైగా బస్సులు పండుగ రోజు నడిచాయి. వాస్తవానికి దసరా రోజు 1,49,844కి.మీలు నడవాల్సి ఉండగా, అదనంగా 55,167కి.మీలు నడిచాయి. దీంతో రీజియన్ పరిధిలో ఆర్టీసీకి రూ.88,49,295ఆదాయం సమకూరింది. దేవరకొండ డిపోలో ఈనెల 12వ తేదీన రూ.19,97,219, నల్లగొండ డిపోలో రూ.12,38,262, నార్కట్‌పల్లి డిపోలో రూ.71,487, మిర్యాలగూడ డిపోలో రూ.14,61,999, యాదగిరి గుట్ట డిపోలో రూ.16,07,537 ఉండగా, యాదగిరి గుట్టపైకి జీరో టికెట్ల ద్వారా (ఉచిత ప్రయాణం) రూ.13,79,537 ఆదాయం సమకూరింది. గుట్టపైకి ప్రయాణికులను పురుషులతో పాటు, స్త్రీలను కూడా ఉచితంగా చేరవేస్తారు. ఈ ప్రయాణికులకు సంబంధించిన డబ్బును ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌గా అందిస్తుంది. కోదాడ డిపోలో రూ.10,78,283, సూర్యాపేట డిపోకు రూ.14,00,517 ఆదాయం సమకూరింది.

ఎక్సైజ్‌శాఖకు ఒక్క రోజులో రూ.47.13కోట్లు



దసరా పండుగ సందర్భంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఒక్క రోజులో ఎక్సైజ్‌శాఖకు కాసుల వర్షం కురిసింది. ఉమ్మడి జిల్లాలో 299 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈనెల 12వ తేదీన రూ.47.13కోట్ల ఆదాయం సమకూరింది. దసరా పండుగ రోజు శనివారం కావడంతో కొంతమంది మద్యానికి దూరంగా ఉండటంతో మందు ప్రియులు ఆదివారం అధికంగా లాగించారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో 33,725మద్యం కాటన్లు, 41,800 బీర్ కాటన్ల విక్రయాలు జరిగినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో 11,927మద్యం కాటన్లు, 14,687 బీర్ కాటన్ల విక్రయాలు జరిగాయి.

పండుగ పూట పలు విషాదాలు

● ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత •7లో..

ఎమ్మెల్సీ ఎన్నికకు ఏర్పాట్లు షురూ..

శాసనమండలి నల్లగొండ- వరంగల్-ఖమ్మం ఉపాధ్యాయ నియోజకవర్గ ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుత ఎమ్మెల్సీ పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుండడంతో, ఓటర్ల నమోదు ప్రక్రియను ఎన్నికల సంఘం చేపట్టింది. అందుకు ఇప్పటికే మొదటిదఫా నోటిఫికేషన్ విడుదల చేయగా, ఉపాధ్యాయ సంఘాలు తమ అభ్యర్థుల ఎంపికను మొదలుపెట్టాయి. నవంబరు 6 వరకు అర్హులైన ఉపాధ్యాయులు ఓటర్లుగా నమోదుచేసుకునేందుకు గడువు ఉంది. సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డిని మరోసారి యూటీఎఫ్ అభ్యర్థిగా ఆ సంఘం ప్రకటించింది. పీఆర్‌టీయూటీఎస్, టీపీఆర్‌టీయూ, టీపీయూఎస్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులు ఈ సారి బరిలో ఉండేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికలో పోటీకి పలువురు కీలక ఉపాధ్యాయ సంఘ నేతలు ఉత్సుకత చూపుతుండడంతో పోరు రసవత్తరంగా మారనుందనే అభిప్రాయం ఉపాధ్యాయవర్గాల్లో ఉంది. ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ



» మొదలైన ఉపాధ్యాయ ఓటర్ల నమోదు ప్రక్రియ
» మరోదఫా యూటీఎఫ్ అభ్యర్థిగా నర్సిరెడ్డి
» పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిత్వంపై ఉత్కంఠ
» బరిలో నిలిచేందుకు పలు సంఘాల సన్నాహాలు



నల్లగొండ-వరంగల్-ఖమ్మం నియోజకవర్గంలో గత ఎన్నికల్లో 20,898 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికల సమయంలో రూపొందించిన ఓటర్ల జాబితాను రద్దుచేసిన ఎన్నికల సంఘం, తాజాగా అర్హులైన ఉపాధ్యాయులంతా మళ్లీ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తూ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నియోజకవర్గంలో మొత్తం 12 జిల్లాలు ఉన్నాయి. ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో 142 మంది ఉపాధ్యాయులే ఓటర్లుగా నమోదు చేసుకున్నారు. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 38 మంది ఓటర్లుగా నమోదు చేసుకోగా, ములుగు జిల్లాలో ముగ్గురు ఉపాధ్యాయులు మాత్రమే నమోదు చేసుకున్నారు. భూపాలపల్లి, సిద్ధిపేట జిల్లాల్లో ఓటర్ల నమోదు ప్రారంభం కాలేదు. అయితే నవంబరు 6వ తేదీ వరకు గడువు ఉండడం, ఇప్పుడే ప్రక్రియ మొదలవడంతో ఈ నెలాఖరునాటికి ఓటర్ల నమోదు ఊపందుకుంటుందని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. హైస్కూల్‌లో పనిచేసే అన్ని కేటగిరీల టీచర్లు, ఇంటర్ కాలేజీలు మొదలు యూనివర్సిటీల వరకు పనిచేస్తున్న అధ్యాపకులు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాల్లో పనిచేసే పీజీటీ టీచర్లు, ఉపాధ్యాయ ట్రైనింగ్ కళాశాలల అధ్యాపకులు ఓటర్లుగా నమోదుకు అర్హులు. వీరితో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా సర్వీస్ రిజిస్టర్‌లో పేరు నమోదై ఉండి, మూడేళ్ల సర్వీస్, మూడేళ్ల పాటు పీఎఫ్ వాటా చెల్లించి ఉంటే ఆ ఉపాధ్యాయులు కూడా ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉండడంతో ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

నాలుగో సారి ఎన్నిక

ఉమ్మడి రాష్ట్రంలో 2007లో శాసనమండలి పునరుద్ధరణ జరిగిన తర్వాత మొదటగా 2007లో జరిగిన ఈ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో స్వాతంత్ర్య సమరయోధుడు, విద్యావేత్త చుక్కా రామయ్య మొదటిసారి గెలుపొందారు. ఆ తర్వాత 2013లో జరిగిన ఎన్నికల్లో పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్ సమీప ప్రత్యర్థి నారాయణ (యూటీఎఫ్)పై విజయం సాధించారు. అనంతరం 2019లో జరిగిన ఎన్నికల్లో యూటీఎఫ్ నుంచి బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డి సిట్టింగ్ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి పూల రవీందర్‌పై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ పూల రవీందర్‌కు మద్దతుగా నిలిచినా విజయం అందుకోలేకపోయారు. తాజాగా, 2025లో జరిగే ఎన్నికల్లో పోటీచేసేందుకు మరోసారి అలుగుబెల్లి నర్సిరెడ్డిని యూటీఎఫ్ అభ్యర్థిగా ఇప్పటికే ప్రకటించింది. పీఆర్‌టీయూటీఎస్, టీపీఆర్‌టీయూ, టీపీయూఎస్‌తో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా బరిలో నిలిచేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై బకాయిల బండ

» కళాశాల నిర్వహణకు ఇబ్బందిగా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు
» బంద్ బాటలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలు
» మూడేళ్లుగా రూ.120కోట్ల మేర బకాయిలు



బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరంకాకూడదనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రైవేట్ కళాశాలలకు గుదిబండగా మారింది. మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకాకపోవడంతో కళాశాలలను నడపలేకపోతున్నామని యాజమాన్యాలు వాపోతున్నాయి. మొత్తంగా కళాశాలలకు రూ.120కోట్ల మేర ప్రభుత్వం బకాయిపడగా, ఇక తమవల్ల కాదంటూ కళాశాలల బంద్‌కు యాజమాన్యాలు పూనుకున్నాయి. •7లో..

మూసీవేసే దిశగా కళాశాలలు

ఉమ్మడి రాష్ట్రంలో ఎంజీయూ పరిధిలో 120 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. అవి ప్రస్తుతం 58కి పడిపోయాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో ఇంకొన్ని కళాశాలలు మూసివేసే దిశగా ఉన్నాయి. ఇది డిగ్రీ విద్యకు పేదలను దూరం చేయడమే. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయకపోతే కళాశాలలను బంద్ చేస్తాం. దీనికి అందరూ సహకరించాలి.

- సైదారావు, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ నేత

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

నల్లగొండ, అక్టోబరు 13: జిల్లాలో గుర్తించిన 325ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు. ఆదివారం నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. వానాకాలం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 375కేంద్రాలు ప్రారంభించాలని లక్ష్యంగా నిర్ణయించామని, తొలి విడతగా 325 కేంద్రాలను ఈనెల 14వ తేదీలోగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆర్జాలబావి వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇటీవల ప్రారంభించారని, ఇప్పటికే 100మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. టెలికాన్ఫరెన్స్‌లో డీఎస్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, పలు శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు బుద్ధవనంలో దమ్మవిజయం వేడుకలు

నాగార్జునసాగర్, అక్టోబరు 13: అంతర్జాతీయ బౌద్ధక్షేత్రం, నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో 276 ఎకరాల్లో నిర్మితమైన బుద్ధవనంలో సోమవారం దమ్మవిజయం వేడుకలు నిర్వహించనున్నట్టు పర్యాటకశాఖ ఎండీ, ప్రత్యేకాధికారి ప్రకాశ్‌రెడ్డి ఆదివా రం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వేడుకలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

17 నుంచి లతీఫుల్లా షా ఖాద్రీ ఉర్సు

నల్లగొండకల్చరల్, అక్టోబరు 13: జిల్లా కేంద్రంలో సయ్యద్ లతీఫుల్లా షాఖాద్రీ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 17న ప్రారంభించనున్నట్టు మునిసిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం గుట్ట మెట్ల వద్ద ఉర్సు ఉత్సవాల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 17న రాత్రి గంధం ఊరేగింపు, 18న దైవ ప్రార్థనలు, 19న ఖవ్వాలీ ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నవీన్‌గౌడ్, ఇబ్రహీం, సయ్యద్ సమద్, ఉర్సు కమిటీ సభ్యులు ఇం తియాజ్, చాంద్, జీయాద్, ఇర్ఫాన్, సయ్యద్ సమీవుల్లాఖాద్రీ, సయ్యద్ గౌస్‌వుల్లాఖాద్రీ, సల్మాన్ ఖాద్రీ, ఉబేద్ ఖాద్రీ, తబరేజుఖాద్రీ పాల్గొన్నారు.

● కిక్కిరిసిన జాతీయ రహదారులు



దసరా సెలవులకు స్వగ్రామాలకు వెళ్లిన ప్రజలు నగరం బాట పట్టడంతో జాతీయ రహదారులపై రద్దీ ఏర్పడింది. దీంతో పంతంగి, గూడూరు టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్‌జాం నెలకొంది. •7లో..

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

చిట్యాలరూరల్, అక్టోబరు 13: వరి కోత మిషన్‌కు విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని సుంకెనపల్లి గ్రామంలో జరిగింది. గ్రామస్థులు, చిట్యాల ఎస్ఐ నకిరేకంటి ధర్మ తెలిపిన వివరాల ప్రకారం... సుంకెనపల్లికి చెందిన అవిశెట్టి శంకరయ్య రెండో కుమారుడు అవిశెట్టి వినయ్(17) వరి కోత యంత్రంపై సహాయకుడిగా వెళ్లాడు. గ్రామానికి చెందిన రైతు పొలంలో వరి చేనును కోసే సమయంలో వరి కోత మిషన్‌పై ఆవుల అనీల్‌తో కలిసి సహాయకుడిగా వెళ్లి వరి చేను కోత పనుల్లో నిమగ్నమయ్యారు. ఆ ప్రాంతం పైభాగంలో ఉన్న విద్యుత్ తీగలు వరికోత మిషన్‌కు తగలడంతో గమనించిన అనీల్ వినయ్‌ను కిందకు దూకాలని హెచ్చరిస్తూ తాను కిందకు దూకాడు. వినయ్ కూడా హుటాహుటిన దిగేందుకు యత్నంలో కాలు కింద పెట్టగానే విద్యుదాఘాతంతో ఒక్కసారిగా కిందపడి పోయాడు. స్థానికులు వినయ్‌ను చికిత్స నిమిత్తం చౌటుప్పల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. ఈ సంఘటనపై వినయ్ తండ్రి శంకరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో హార్డ్‌వేర్ దుకాణం దగ్ధం

మోటకొండూరు, అక్టోబరు 13: షార్ట్ సర్క్యూట్‌తో హార్డ్‌వేర్ షాపు దగ్ధమైంది. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలకేంద్రంలో జరిగింది. స్థానికులు, ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గిరబోయినగూడెం గ్రామానికి చెందిన గిరబోయిన మల్యాయ్య మండలకేంద్రంలో బాలాజీ హార్డ్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. తన సొంత ప్లాట్‌లో రేకుల షెడ్డు నిర్మించి ఈ నెల 4న షాపు ప్రారంభించాడు. శనివారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి షాపులో దేవునికి దీపం వెలిగించి ఇంటికి వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత షాపులో ఒక్కసారిగా షార్ట్‌సర్క్యూట్ కావడంతో భారీగా మంటలు చెలరేగాయి. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పాండు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు. మంటలను ఆర్పేందుకు ఫైర్ సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించారు. సుమారు రూ.50లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు షాపు యాజమని తెలిపాడు. దుకాణం పక్కనే ఉన్న భూమండ్ల బుచ్చేందర్ ఇంటి గోడలు పూర్తిగా కూలిపోవడంతో పాటు 27 తూలల బంగారం, ఫర్నిచార్ దగ్ధమైంది. ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య బాధిత కుటుంబానికి తక్షణ సహాయం ద్వారా రూ.లక్ష ఆర్థిక సహాయం ప్రకటించారు. ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబాన్ని అదుకుంటమాని హామి ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్‌గౌడ్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ పరామర్శించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు.

మద్యం దుకాణాలపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్ అక్టోబరు 13: నిబంధనలకు విరుద్ధంగా వైన్స్‌లలో మద్యం విక్రయిస్తున్న వైన్స్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సాయి వైన్స్, సాయిదుర్గ వైన్స్, ఎస్‌వీఆర్ వైన్స్, ఎస్వీ వైన్స్‌లలో దసరా సందర్భంగా నిబంధలకు విరుద్ధంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మద్యం విక్రయించారు. నాలుగు వైన్స్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు..

చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

శాలిగౌరారం, అక్టోబరు 13: సూర్యాపేట జిల్లా తిరుమలగిరి ఎస్‌ఐ కొట్టాడని ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన టిప్పర్ డ్రైవర్ శనిగ నాగరాజు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ శనిగ నాగరాజు(40) సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తండా గ్రామంలో క్రషర్ మిల్లులో పని చేస్తున్నాడు. మిల్లు యజమాని అక్రమంగా కేసు పెట్టారని ఎస్‌ఐ కొట్టారని మనస్తాపం చెంది ఈనెల 4న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా గ్రామస్థులు కాపాడి ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలలపై బకాయిల బండ

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కోసం డిగ్రీ కళాశాలల నిర్వాహకులు ఆందోళన బాటపట్టనున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని ప్రైవేట్ డిగ్రీ కళాశాలకు సుమారు రూ.120 కోట్ల బకాయిలు రావాల్సి ఉంది. కళాశాలల నిర్వహణకు కొన్నేళ్లుగా ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు గుదిబండగా మారాయి. ఈ నేపథ్యంలో దసరా సెలవుల్లోగా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుంటే సెలవుల అనంతరం కళాశాలలను తెరిచేది లేదంటున్నారు. ఇంజనీరింగ్(టెక్నికల్) కళాశాలలతో ముడిపెట్టకుండా డిగ్రీ(నాన్ టెక్నికల్) కళాశాల ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

- కోదాడ, భువనగిరి టౌన్.

బడుగు, బలహీనవర్గాల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరంకాకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్(ఆర్‌టీఎఫ్, బోధన రుసుం), ఉపకార వేతనాల(ఎంటీఎఫ్, మెస్‌చార్జీలు)ను అందిస్తోంది. విద్యాసంవత్సరం పూర్తయ్యేలోపు అందాల్సిన ఫీజురీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల చేయకపోవటంతో కళాశాలలను నడపలేకపోతున్నామని యాజమాన్యాలు వాపోతున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 2016-17 విద్యాసంవత్సరం వరకు 120ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉండగా ప్రస్తుతం 58కి తగ్గడమే నిదర్శనమన్నారు. మూడేళ్లుగా ఆయా డిగ్రీ కళాశాలలకు సుమారు రూ.120కోట్ల మేర ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాలు బకాయిలు రావాల్సి ఉందంటున్నారు. అధ్యాపకుల వేతనాలు, భవనాల అద్దెలు, విద్యుత్ బిల్లులు, యూనివర్సిటీ రుసుములు, ఇతర చెల్లింపులు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఒకే కేటగిరితో బకాయిలు

ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం అప్పటి ప్రభుత్వం ఇంటర్ వరకు ఒక కేటగిరిగా, ఆపై ఉన్నత చదువుల కింద మరో కేటగిరిగా విభజించింది. అందులో భాగంగా డిగ్రీతో పాటు పీజీ, ఇంజనీరింగ్ చేసే విద్యార్థులను ఒక గొడుగు కిందికి చేర్చారు. ఈ విధానంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు కొన్నేళ్లుగా వాపోతున్నాయి. కళాశాలలను టెక్నికల్, నాన్‌టెక్నికల్ కళాశాలలను విభజించకపోవడం, ఇంజనీరింగ్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలను కలపటంతో ఫీజురీయింబర్స్‌మెంట్ ఎక్కువ కనిపిస్తోంది. దీంతో గత, ప్రస్తుత ప్రభుత్వాలు ఫీజురీయింబర్స్‌మెంట్‌ను సకాలంలో విడుదల చేయకపోవటంతో రూ.వందల కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి. ఫలితంగా తక్కువ ఫీజురీయింబర్స్‌మెంట్ వచ్చే ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలు ఇబ్బందులు పడాల్సి పరిస్థితి నెలకొందని డిగ్రీ కళాశాలల నిర్వాహకులు వాపోతున్నారు. ఇంజనీరింగ్ కళాశాలలకు వచ్చే ఫీజురీయింబర్స్‌మెంట్ రూ.వేల కోట్లలో ఉంటుంది. అదే డిగ్రీ కళాశాలలకు వచ్చేటప్పటికీ రూ.వందల కోట్లలో ఉంటుందని పేర్కొంటున్నారు.

సీట్లు భర్తీకాక...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో కలిపి డిగ్రీ విద్యార్థులు 30 వేల వరకు ఉన్నారు. అందులో 80 శాతం వరకు ఫీజురీయింబర్స్‌మెంట్‌పై చదువుతున్న వారే ఉండటం గమనార్హం. కాగా మూడు, నాలుగేళ్లుగా డిగ్రీలో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపించడం లేదు. దీంతో విద్యార్థుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గుతూ వస్తోంది. ఈ ఏడాది కేవలం ఆరు వేల



మంది విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్లు పొందారు. ఇందులో ఎక్కువగా బీకాం, ఎంపీసీఎస్‌లో చేరిన వారే అధికం. దోస్త్(డిగ్రీ ఆన్‌లైన్ సర్వీస్ తెలంగాణ)తో సీట్లు నిండక ఇబ్బందులు పడుతుంటే, వచ్చే తక్కువ ఫీజురీయింబర్స్‌మెంట్ విద్యాసంవత్సరం ముగిసేనాటికి కూడా రాకపోవటంతో కళాశాల నిర్వహణ భారంగా తయారైందని కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నారు. ఇదిలా ఉండగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవటంతో డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ కళాశాలలు ఇవ్వటం లేదు. పేద విద్యార్థులు డబ్బులు చెల్లించే స్తోమత లేక సర్టిఫికెట్లు అందక ఉన్నతవిద్యకు దూరం కావాల్సి వస్తోంది. కళాశాల నిర్వహణ పరిస్థితులను ఉన్నతాధికారుల, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, అయినా స్పందన లేదని తప్పని పరిస్థితిలో దసరా సెలవులు తర్వాత కళాశాల బంద్‌కు సిద్ధమవుతున్నట్లు కళాశాలల నిర్వాహకులు పేర్కొంటున్నారు.

ఇబ్బందుల్లో విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో విడుదల కాకపోవడంతో యాజమాన్యాలతో పాటు విద్యార్థులకు కూడా ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. డిగ్రీ, పీజీ పూర్తిచేసిన విద్యార్థుల ఫీజులు బకాయి ఉండడంతో టీసీ తదితర సర్టిఫికెట్లు ఇవ్వడానికి యాజమాన్యాలు నిరాకరిస్తున్నాయి ఫీజు బకాయి చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని అంటున్నారు. ప్రభుత్వం విడుదల చేసే ఫీజు రియంబర్స్‌మెంట్‌ను మీరే తీసుకోండి ఫీజులు మాత్రం ఇప్పుడు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని స్పష్టం చేస్తుండడంతో కళాశాలలో వాగ్వాదాలు జరుగుతున్నాయి.

బడ్జెట్‌లో నిధుల కేటాయింపు పెంచాలి



బడ్జెట్‌లో విద్య కేటాయింపులు పెంచాలి. డిగ్రీ విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు తక్కువ. వచ్చేవి సకాలంలో రాక కళాశాలల నిర్వహణ కష్టంగా మారింది. అటెండర్ల జీతాలు ఇవ్వలేని పరిస్థితి. మూడేళ్లుగా బకాయిలు ఇవ్వకపోతే కళాశాలల నిర్వహణ ఎలా చేపట్టాలో ప్రభుత్వమే చెప్పాలి. ఈ పరిస్థితితో గ్రామీణ ప్రాంత విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం బకాయిలు విడుదల చేసి కళాశాలలను ఆదుకోవాలి.

● ముత్తినేని సైదేశ్వరరావు, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు

ప్రభుత్వం నిర్లిప్తతను వీడాలి

ప్రతి సంవత్సరం లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లిప్త త విడనాడాలి. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విడు దల కాకపోతుండడంతో యాజమాన్యాలు ఆర్థిక ఇబ్బందులకు గురు వుతున్నాయి. కళాశాల నిర్వహణకు చేస్తున్న అప్పులను తీర్చలేక మానసిక ఆందోళనకు గురువుతున్నారు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే ఆత్మహత్యలే శరణ్యం అయ్యే పరిస్థితులు నెలకొనే ప్రమాదముంది.

డాక్టర్ బొజ్జ సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, టీపీడీపీఎంఏ.

కష్టాల కడలిలో యాజమాన్యాలు

నిబంధనల ప్రకారం ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఫీజు రీయింబర్స్‌మెంట్ యాజమాన్యాలకు విడుదల చేయాల్సి ఉంటుంది. పథకం ప్రారంభమైన మొదట్లో సకాలంలో చెల్లింపులు జరిగినప్పటికీ అనంతరం పలు కారణాలు చూపుతూ బకాయిలు విడుదల చేయడంలో నాటి, నేటి ప్రభుత్వాలు జాప్యం చేస్తున్నాయి. దీంతో కళాశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉన్నప్పటికీ కళాశాల నిర్వాహణ యాజమాన్యాలకు భారంగా మారింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వెలుపల ఉన్న కొద్ది మంది విద్యార్థులు కూడా సకాలంలో ఫీజులు చెల్లించకపోగా, మెజార్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోతుండడంతో యాజామాన్యాలు అప్పుల పాలవుతున్నాయి. అద్దె భవనాలలో కొనసాగుతున్న మెజార్టీ కళాశాలల అద్దెను, సొంత భవనాలు నిర్మించిన యాజామాన్యాలు బ్యాంక్ ఈఎంఐలను చివరికి విద్యుత్ బిల్లులను కూడా చెల్లించలేని స్థితికి యాజామాన్యాలు చేరిన పరిస్థితి. ఈ నేపథ్యంలో లెక్చరర్స్, ఇతర సిబ్బంది వేతనాల కోసం అధిక వడ్డీతో అప్పులు చేస్తూ నెలవారిగా వడ్డీలు చెల్లించక పోతుండడంతో పంచాయితీలకు దారితీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో అద్దె చెల్లించని కళాశాలల భవనాలకు యాజమానులు తాళాలు వేయగా, అప్పులు ఇచ్చిన మరికొద్ది మంది విద్యార్థుల సమక్షంలోనే యాజామాన్యాలను దూషిస్తున్న సంఘటనలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాల యాజమాన్యాల అసోసియేట్(టీపీడీఎంఏ) ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌కు కలిసి తమ గోడును వెల్లబోసుకుని వినతిపత్రాలు అందజేశారు. అయినప్పటికీ ఫలితం లేకపోవడంతో దసరా సెల వుల అనంతరం కళాశాలల బంద్ పాటిస్తూ గత నెల చివరి వారంలోనే ప్రకటి ంచారు. ప్రభుత్వం నుంచి సాకుకూలత రాకపోవడంతో సోమవారం నుంచి కళాశాలల బంద్‌ను పాటించేందుకు యాజమాన్యాలు సన్నద్ధమవుతున్నాయి. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర కమిటీ, ఉమ్మడి జిల్లాల కమిటీ, స్థానిక కమిటీలతో యూనియన్ ప్రముఖులు జూమ్ మీటింగ్‌లు నిర్వహించారు. కళాశాలల పునర్‌ప్రారంభం ప్రభుత్వ వైఖరి పైనే ఆధారపడి ఉంటుందని అసోసియేషన్ స్పష్టం చేస్తోంది.

పండుగ పూట విషాదాలు

● ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు చోట్ల రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాత

పండుగ పూట ఉమ్మడి నల్లగొండ జిల్లాలో విషాదాలు చోటుచేసుకున్నాయి. వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృత్యువాతపడ్డారు. ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.



మహేష్(ఫైల్)

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన తోకల మహేష్(27) కొంత కాలం గా మునగాల మండలకేంద్రంలోని ఎల్ అండ్ టీ ఫైనాన్స్ కంపెనీలో మార్కెటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగం గా శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో తన గ్రా మం లింగగిరి నుంచి మునగాల వెళ్లి పనులు ముగించుకొని మునగాల నుంచి లింగగిరి తన ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. మార్గమధ్యలోని రాయినిగూడెం గ్రామ శివారులో రా త్రి సమయంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డు పక్కకు పడిపోవడంతో. మహేష్ తలకు బలమైన గాయాలయ్యాయి. రోడ్డు పక్కన గల కాల్వపల్లి మేజర్ కాల్వలో పడి కొంత దూరం నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి మృతిచెందినట్లు ఎస్‌ఐ చలికంటి నరేష్ తెలిపారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మహేష్ తండ్రి దుర్గయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సామాగ్రి కొనుగోలు చేసి ఇంటికి వెళ్తుండగా..

మిర్యాలగూడ అర్బన్: నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని రాయినిపాలెం గ్రామానికి చెందిన బూర నాగయ్య(34) తన సోదరుడు బూర సైదులుతో కలిసి బైక్‌పై మిర్యాలగూడకు వెళ్లి పండగ సామాగ్రి కొనుగోలు చేసి ఇంటికి బయలు దేరారు. రాయినిపాలెం వెళ్తున్న క్రమంలో గ్రామ శివారులో ఆలగడప వైపు వేగంగా వస్తున్న ఏపీ05యాటీ 9352 నెంబర్‌గల అశోక్‌లేలాండ్ డీజే వాహనం అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న నాగయ్యతోపాటు అతని వెంట ఉన్న సైదులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదంలో నాగయ్య తల, ఛాతిభాగంలో గాయాలు కాగా, సైదులు తలకు గాయమైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ నాగయ్య మృతిచెందాడు. మరో వ్యక్తి సైదులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు రూరల్ ఎస్‌ఐ లోకేష్‌కుమార్ తెలిపారు. నాగయ్య భార్య ప్రవంతి ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన వాహనం డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నాగయ్యకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.



నాగయ్య మృతదేహం

నిల్చున్న వ్యక్తిని బైక్ ఢీకొని..



నర్సిరెడ్డి(ఫైల్)

వలిగొండ: ద్విచక్ర వాహనం అతి వేగంగా నడుపుతూ నిలబడిన వ్యక్తిని ఢీకొనడంతో ఆ వ్యక్తి మృతిచెందాడు. భువనగిరి జిల్లా మండలంలోని ముద్దాపురం మదిర కొడమర్ల బావికి చెందిన సూది నర్సిరెడ్డి(52) శనివారం సాయంత్రం రోడ్డు పక్కన మాట్లాడుతుండగా అటుగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న విష్ణు నిర్లక్ష్యంగా అజాగ్రత్తగా వాహనం నడుపుతూ రోడ్డు పక్కన ఉన్న నర్సిరెడ్డిని బలంగా ఢీ కొట్టాడు. ఆ వేగంతో నర్సిరెడ్డి పక్కనే ఉన్న రక్షిత్‌రెడ్డిపై పడ్డాడు. ఈ ప్రమాదంలో నర్సిరెడ్డికి తలకు బలమైన గాయమై రక్త గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హైదరాబాద్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. నర్సిరెడ్డి కుమారుడు రాజశేఖర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యుగేందర్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఫీల్డ్‌అసిస్టెంట్ మృతి



బిచ్యానాయక్(ఫైల్)

మర్రిగూడ: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలకేంద్రంలోని దోర్నాల బావి మూలమలుపు వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొండూరు ఫీల్డ్ అసిస్టెంట్ బిచ్యానాయక్(35) మృతిచెందాడు. బిచ్యానాయక్ తన స్వగ్రామమైన తూర్పుతండాకు బైక్‌పై వెళ్తుండగా కొండూరు గ్రామం నుంచి శివ బైక్‌పై మర్రిగూడకు వస్తుండగా దోర్నాల మూలమలుపు వద్ద రెండు బైక్‌లు ఢీకొన్నాయి. దీంతో బిచ్యానాయక్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. స్థానికులు వెంటనే మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. ఈ విషయం తెలవడంతో బంధువులు పెద్దఎత్తున ఆస్పత్రి వద్దకు తరలివచ్చారు. బిచ్యానాయక్ మృతికి కారణమైన శివ ఇంటి ఎదుట మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేసేందుకు ఓ వాహనంలో తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. ఆ సమయంలో ఎస్‌ఐ రంగారెడ్డి వారిని అడ్డుకొని నచ్చజెప్పారు. బిచ్యానాయక్ మృతికి కారణమైన వ్యక్తిని అరెస్టు చేసి, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు ఆస్పత్రి వద్ద బైఠాయించారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో మర్రిగూడ, నాంపల్లి, చింతపల్లి నుంచి పోలీసులను పిలిపించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఓ వాహనంలో తీసుకెళ్తుండగా బంధువులు మళ్లీ అడ్డుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో బంధువులు శాంతించారు. రాత్రి 12 గంటల సమయంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. దసరా పండుగ రోజు బిచ్యానాయక్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల తూర్పుతండాలో విషాధ చాయలు అలుముకున్నాయి. బిచ్చునాయక్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. బిచ్యానాయక్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందడం పట్ల కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అయ్యారు. పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రంగారెడ్డి తెలిపారు.

మంచాల: రంగారెడ్డి జిల్లా మంచాల పోలీస్‌స్టేషన్ పరిధిలోని రంగాపూర్ సమీపంలో ఆదివారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. వివరాలిలా ఉన్నాయి. యాదాద్రి-భువనగిరి జిల్లా నారాయణపురం మండలం క్రొవానితండాకు చెందిన కొర్ర రవీందర్(38) తన బైక్‌పై మంచాల మండలం అంబోత్‌తండాకు బంధువుల ఇంటికి వెళ్తుండగా రంగాపూర్ సమీపంలో ఎదురుగా బైక్‌పై వస్తున్న మరో వ్యక్తి ఎదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రవీందర్ ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. రవీందర్‌కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవాలయం వద్ద ఇరు వర్గాల ఘర్షణ



బేతవోలులోని దేవాలయం వద్ద పోలీసులతో గ్రామస్థుల వాగ్వాదం

చిలుకూరు, అక్టోబరు 13: దసరా ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని బేతవోలులో కనకదుర్గమ్మ దేవాలయం వద్ద శనివారం రాత్రి రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేతవోలు గ్రామంలో దసరా ఉత్సవాల సందర్భంగా కనకదుర్గమ్మ ఆలయం పక్కనే ఉన్న వీర్లదేవి చెరువు వద్ద శనివారం రాత్రి తెప్పోత్సవం నిర్వహించారు. దేవాలయం వద్దకు వచ్చిన మాజీ సర్పంచ్ వట్టికూటి చంద్రకళ భర్త నాగయ్య చెరువు పక్కన మూత్ర విసర్జన చేస్తుండగా, గ్రామానికి చెందిన రెమిడాల వినోద్ సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీశాడు. గమనించిన వట్టికూటి నాగయ్య కుటుంబ సభ్యులు ఫొటోలు ఎందుకు తీస్తున్నావని అడగడంతో ఘర్షణ మొదలైంది. ఈ విషయమై గ్రామానికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్ కుటుంబ సభ్యులు, నాగయ్య కుటుంబ సభ్యుల మధ్య ఘర్షణ జరిగింది. ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్ వట్టికూటి నాగయ్యను తన్నడంతో ఘర్షణ మరింత పెద్దదైంది. దీంతో జాతర చూసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన కోదాడ టౌన్ సీఐ రాము, ఎస్‌ఐ రాంబాబు, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు వరకుమార్ కుటుంబ సభ్యులను దేవాలయంలోకి పంపి గేట్లు వేశారు. ఎదుటి వర్గం వారిని దేవాలయానికి దూరంగా పంపారు. దేవాలయం లోపల వరకుమార్ వర్గంతో పాటు మరో చిన్న గేటు నుంచి లోపలికి వెళ్లిన నాగయ్య వర్గాల మధ్య కనకదుర్గమ్మ దేవాలయంలో గొడవ జరిగి ఇరువర్గాల వారు అక్కడ ఉన్న రాళ్లు, ప్లాస్టిక్ పైపులతె ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు లాఠీచార్జి చేసే సమయంలో టౌన్ సీఐ రాము, ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లుపై ఏఆర్ కానిస్టేబుల్ వరకుమార్ వర్గం వారు దాడి చేయడంతో వారికి గాయాలయ్యాయి. వారితో పాటు నాగయ్య వర్గానికి చెందిన కొందరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని వరకుమార్‌తో పాటు పలువురిని అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

ఆత్మకూరు(ఎం): దసరా పండుగ సందర్భంగా యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలంలోని కూరెళ్ల, పల్లెర్ల గ్రామాల్లో శనివారం గొడవలు జరిగాయి. కూరెళ్లలో జమ్మిపూజ వద్ద కంకణదారణ, జెండావిష్కరణ విషయంలో బీఆర్‌ఎస్, సీపీఐ నాయకుల మధ్య వాదోపవా దాలు జరిగి చివరకు తోపులాటకు దారి తీసింది. తోపులాటలో ఇరువురికి గాయాలైనట్లు తెలిసింది. గామానికి చెందిన బెజ్జంకి బిక్షం తన ఇంటి పక్కన షెడ్‌లో పార్కింగ్ చేసిన కారు, రెండు బైకులపై గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోలు పోసి తగులబెట్టినట్లు బాధితుడు తెలిపారు. పల్లెర్ల గ్రామంలో శనివారం రాత్రి దుర్గామాత షెడ్ వద్ద ఏర్పాటు చేసిన డీజే పాటల్లో పార్టీల కు సంబంధించిన పాటలు వేస్తున్నారని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ యువకుల మధ్య గొడవ జరిగింది. ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నాయి.

పల్లె వదిలి.. పట్నం వైపు



యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

నల్లగొండ, చౌటుప్పల్ టౌన్, చౌటుప్పల్ రూరల్, కేతేపల్లి, బీబీనగర్, అక్టోబరు 13: వరుస సెలవులతో దసరా పండుగకు ఏపీ రాష్ట్రంతో పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి హైదరాబాద్‌కు తిరిగి పయనమైన వాహనాలతో ఆదివారం65వ నెంబర్ జాతీయ రహదారి రద్దీగా మారింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో, నల్లగొండ జిల్లా కేతేపల్లి టోల్‌గేట్ వద్ద వాహనాలు ఆగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మధ్యాహ్నం నుంచి తమ వాహనాలతో తిరుగు ప్రయాణం కావడంతో జాతీయ రహదారిపై రద్దీ పెరిగింది. చౌటుప్పల్‌లో ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో హైవేపై 24గంటల పెట్రోలింగ్ నిర్వహిస్తూ ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకున్నారు.

● యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద వాహనాలు బారులు తీరాయి. 16 గేట్లకు గాను 10 గేట్ల ద్వారా హైదరాబాద్ వైపు వాహనాలను పంపించారు. సాధారణ రోజుల్లో 30 నుంచి 35వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుండంగా దసరా పండుగ నేపథ్యంలో 50వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగించినట్లు టోల్‌గేటు నిర్వాహకులు తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణకు టోల్‌గేట్ నిర్వాహకులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

● యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ వైపు వెళ్లే టోల్‌గేట్ల వద్ద వాహనాలు బారులు తీరాయి. ఫాస్టాగ్ కలిగిన వాహనాలు గేటు దాటేందుకు 15నుంచి 20సెకన్ల సమయం పడుతుండడంతో కిలోమీటరు పైగా వాహనాలు బారులు తీరాయి. ఆదివారం రోజు సుమారు 22వేల వాహనాలు హైదరాబాద్ వైపు వెళ్లి ఉంటాయని టోల్ సిబ్బంది తెలిపారు.

● నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్ శివారులో గల టోల్‌ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరడంతో వాహనాల రద్దీకి అనుగుణంగా టోల్‌ప్లాజా నిర్వాహకులు హైదరాబాద్ వైపు వెళ్లే వాహనదారులు టోల్ చెల్లింపులకు అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో టోల్ ప్లాజా నుంచి కొర్లపహాడ్ వైపు అర కిలో మీటర్ మేర రహదారిపై నాలుగు లేన్లతో బారులు తీరడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు కదిలాయి. సాధారణ రోజుల్లో కేతేపల్లి టోల్‌ప్లాజా నుంచి 20వేల వాహనాలు రాకపోకలు సాగించేవి. పండుగ నేపథ్యంలో ఆదివారం 35నుంచి 40 వేల వాహనాలు రాకపోకలు సాగించాయని సిబ్బంది తెలిపారు. మొత్తం 12గేట్లలో హైదరాబాద్ వైపు ఆరు, విజయవాడ వైపు ఆరు గేట్లు ఏర్పాటు చేశారు. విజయవాడ, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలతో పాలు తెలంగాణలోని ఖమ్మం, భద్రాచలం, కొత్తగూడెం, సూర్యాపేట, కోదాడ ప్రాంతాలకు చెందిన వారు సొంత గ్రామాలకు నాలుగు రోజుల క్రితం తరలి వెళ్లారు. మామూలు రోజుల్లోనే రద్దీగా ఉండే రహదారిపై పండుగ సమయంలో విరామం లేకుండా వాహనాలు వెళ్లాయి.

నల్లగొండ బైపాస్‌లో పెద్దసంఖ్యలో నిలిచిన వాహనాలు

నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై ఆదివారం రాత్రి ఏడు గంటల సమయంలో భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లాకేంద్రంలోని మర్రిగూడ బైపాస్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండటంతో రోడ్డు ఇరుకుగా ఉండటంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. చర్లపల్లి నుంచి మిర్యాలగూడ వెళ్లే వైపు, మిర్యాలగూడ నుంచి నల్లగొండకు వెళ్లేవైపులో పానగల్లు నుంచి చర్లపల్లి వరకు ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. దసరా పండుగకు వెళ్లిన వారంతా తిరుగు ప్రయాణం కావడంతో వాహనాలు నిలిచిపోయాయి. దీనికితోడు బతుకమ్మ కుంట చెరువు వద్ద నిమజ్జనం ఉండడంతో జనం పెద్ద ఎత్తున చేరుకున్నారు. బైపాస్ వద్ద లారీ, కారు ఢీకొనడంతో కారు స్వల్పంగా ధ్వంసమైనట్లు సమాచారం.


నకిరేకల్ దసరా వేడుకల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీరేశం పుష్ప దంపతులు


మిర్యాలగూడ : దసరా ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు


దేవరకొండ : వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్


చందంపేటలో పాల్గొన్న భక్తులు


నల్లగొండలో రావణ దహనం




శాలిగౌరారం : పూజల్లో పాల్గొన్న ఎంపీ

దసరా వచ్చింది.. సరదా తెచ్చింది..

దసరా పండుగ వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ప్రజలు భక్తి శ్రద్ధలతో పండుగను నిర్వహించుకున్నారు. తమ సమీపంలోని ఆలయాలకు చేరుకుని ఇష్ట దైవాన్ని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు, పూజలు చేశారు. ఆలయాలన్నీ భక్తులతో సందడి చేశాయి. సాయంత్రం ఆలయాలకు చేరుకుని శమీపూజలో పాల్గొని ఇష్ట దైవాన్ని పూజించుకున్నారు. అనంతరం పాల పిట్ట దర్శనం చేసుకున్నారు. అనంతరం జమ్మి ఆకును ఒకరినొకరు పంచుకొని అలింగనం చేసుకుంటూ పరస్పరం దసరా శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. పలు చోట్ల రావణాసురుని దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలను నిర్వహించారు. (ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)


నల్లగొండ : రామాలయం వద్ద భక్తుల సందడి


చింతపల్లి : వేడుకల్లో పాల్గొన్న బీజేపీ నేత చీకోటి


పూజల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత చాడ కిషన్‌రెడ్డి


రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న మునిసిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి దంపతులు


నల్లగొండ : వీటీ కాలనీలో శమీపూజలో పాల్గొన్న భక్తులు


నల్లగొండ : వివేకానంద నగర్‌లోని ఆలయంలో భక్తుల రద్దీ


తిప్పర్తి : పోలీస్ పహారాలో జమ్మికి వెళ్తున్న భక్తులు

టీఆర్‌టీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరమేష్


జిల్లా ప్రధాన కార్యదర్శిగా తరాల పరమేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర కార్యదర్శి

నల్లగొండ, అక్టోబరు 13: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా నూతన ప్రధాన కార్యదర్శిగా తరాల పరమేష్‌యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని జిల్లా శాఖ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తరాల పరమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానన్నారు. జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేసేందుకు అన్ని మండల శాఖలను త్వరలో నియమించనున్నట్లు తెలిపారు. తన మీద నమ్మకంతో సేవ చేసే అవకాశం కల్పించినందుకు ఆయన రాష్ట్ర నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా పరమేష్ నియామకంపై బీసీ సంఘం నాయకులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నిమ్మనగోటి జనార్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు ముప్పిడి మల్లయ్య, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సైదులు, రాష్ట్ర కార్యదర్శి వి.సూర్యానారాయణ, నాయకులు సాయిబాబా, జలేందర్‌రెడ్డి, జానకీరెడ్డి, జానయ్య, నగేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎంపీపీ సూదిరెడ్డి జన్మదిన వేడుకలు

నార్కట్‌పల్లి, అక్టోబరు 13: నార్కట్‌పల్లి మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. సూదిరెడ్డి స్వగ్రామం జువ్విగూడెంలో కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి గుంతకండ్ల జగదీష్‌రెడ్డిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. నార్కట్‌పల్లిలోనూ సూదిరెడ్డి అనుచరులు ఆయన జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. పలువురు రాజకీయ పార్టీల నాయకులు సూదిరెడ్డి నరేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో జువ్విగూడెం అభివృద్ధి కమిటీ చైర్మన్ బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బద్దం రాంరెడ్డి, పుల్లెంల ముత్తయ్య, సైదులు, రామకృష్ణ, సందీప్, మహేశ్, రమేశ్, శ్రీధర్, రవిచంద్ర, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.


సూదిరెడ్డికి స్వీటు తినిపిస్తున్న మాజీమంత్రి జగదీష్‌రెడ్డి

దైవ చింతన కలిగి ఉండాలి : ఎమ్మెల్యే బాలు

చింతపల్లి, అక్టోబరు 13: సమాజంలోని ప్రతి ఒక్కరూ దైవచింతన కలిగి ఉండాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలకేంద్రంలోని దుర్గామాత వద్ద ఆయన ప్రత్యేక పూజలు జరిపారు. దుర్గమ్మ అనుగ్రహం ప్రతి ఒక్కరూ పొందాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ కో ఆర్డినేటర్ ఎండి.సిరాజ్‌ఖాన్, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణ్, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అలివేలు సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ భవానీపవన్‌కుమార్, మాజీ వైస్ ఎంపీపీ యాదయ్య, యాదగిరి, వెంకటయ్య పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి : చీకోటి ప్రవీణ్

చింతపల్లి, అక్టోబరు 13: ప్రతి ఒక్కరూ హిందు ధర్మాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని బీజేపీ రాష్ట్ర నాయకడు చీకోటి ప్రవీణ్ అన్నారు. మండలంలోని రాజరాజేశ్వరి దేవాలయంలో దుర్గామాతను ఆదివారం దర్శించుకొని మాట్లాడారు. దేశంలో హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రధాని మోదీ చేస్తున్న కృషి ఎంతో ఆ మోఘమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చెనమోని రాములు, రమేష్‌యాదవ్, మహేష్‌గౌడ్, వెన్నం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

శోభాయమానంగా విగ్రహాల నిమజ్జనం

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను ఆదివారం సాయంత్రం భక్తులు శోభాయమానంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు రోజుకో అవతారంతో భక్తులకు దర్శనమిచ్చిన దుర్గామాత విగ్రహాలను ఉత్సవ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనాల్లో మండపాల నుంచి ఊరేగింపుగా సమీప చెరువులు, కుంటలు, కాల్వలకు తరలించి నిమజ్జనం చేశారు. సంప్రదాయ డ్యాన్సులు, మహిళల కోలాటాలతో అమ్మవారిని భక్తిశ్రద్ధల మధ్య ఊరేగించారు. అంతకుముందు ఆయా మంటపాల వద్ద దుర్గామాతకు అలంకరించిన చీరలు, మంటపం వద్ద పూజలందుకున్న కలశాలు, లడ్డూ, శ్రీచక్రాన్ని వేలం నిర్వహించి భక్తులకు అందజేశారు. ఆడపడుచులు నివాళలు తీసుకుని వచ్చి చప్పట్లు, భజనభక్తులు భజన కీర్తనలు ఆలపించుకుంటూ, యువత డప్పు చప్పుళ్ల, ఆటపాటలతో ఘనంగా అమ్మవారిని గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ సందర్భంగా మహిళలు చేసిన కోలాటాలు పలువురిని ఆకట్టుకుంది. ఆయా కార్యక్రమాల్లో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.


కొండమల్లేపల్లి : శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


దామరచర్ల: అమ్మవారి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

- నార్కట్‌పల్లి మండల కేంద్రంలో దుర్గామాత నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు.
- చందంపేట మండలంలోని చందంపేట, చిత్రియాల, ముడుదండ్ల, అంగడిపేట గ్రామాల్లో దుర్గామాత నిమజ్జనాన్ని నిర్వహించారు.
- చండూరుమండలంలోని కస్తాల, చామలపల్లి, పుల్లెంల, ఉడుతలపల్లి, తదితర గ్రామాల్లో అమ్మవారి శోభాయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజలందరినీ అమ్మవారు చల్లగా చూడాలని కోరుకున్నారు.
- కనగల్ మండలంలోని వివిధ గ్రామాల్లో దుర్గాదేవి దుర్గామాత శోభాయాత్రలను ఘనంగా నిర్వహించారు.
- దామరచర్ల మండల కేంద్రంలో నెలకొల్పిన కనకదుర్గమ్మ అమ్మవారి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు.
- చిట్యాల మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.
- చింతపల్లి మండలంలోని వేంకటేశ్వరనగర్‌లోని శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గామాతను భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్లు పూరె లక్ష్మణ్, అంగిరేకుల గోపాల్, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్ పాల్గొన్నారు.


పీఏపల్లి: విగ్రహదాత అంతటి నర్సింహను సన్మానిస్తున్న కమిటీ


నల్లగొండ : వల్లభరావు చెరువు వద్ద విగ్రహ నిమజ్జనానికి వచ్చిన భక్తులు

పేదల హక్కుల పతాక సాయిబాబా

● ప్రజా సంఘాల కన్వీనర్ రామయ్య

మిర్యాలగూడ, నల్లగొండ, నార్కట్‌పల్లి, నల్లగొండ రూరల్, అక్టోబరు 13: ప్రొఫెసర్ సాయిబాబా పేదల హక్కుల పతాక అని, ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్లు బీసం రామయ్య, దర్శనం నర్సింహ, మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం జిల్లాలోని అమరవీరుల స్తూపాల వద్ద వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ దేశ ప్రగతిశీల ఉద్యమాలకు గొప్ప దిక్సూచిగా నిలిచాడని, చెక్కుచెదరని మనోబలంతో ప్రజా ఉద్యమాలకు ఊపిరి అందించాడని కొనియాడారు. ఆదివాసీలు, దళితులు, పీడిత ప్రజల హృదయాల్లో ఆయన నడిపిన ఉద్యమాలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. 90శాతం అంగవైకల్యంతో నిండిన ఆయన్ను పోలీసులు, ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కుమ్మక్కై ఎలాంటి సాక్ష్యం లేని నేరాన్ని ఆయనపై మోపి తొమ్మిదేళ్ల జైలులో నిర్బంధించారని అన్నారు. ఆయన ఆరోగ్యం మరింత క్షీణింపచేసి తీవ్ర అనారోగ్యానికి గురిచేసి విడుదల చేశారని ఆరోపించారు. ఆయన మరణం ముమ్మాటికి హత్యేనని అన్నారు. ప్రజాస్వామ్యం పేరుతో ప్రశ్నించే గొంతుకలను చంపుతున్న తీరుకు సాయిబాబా మరణమే సాక్ష్యమని అన్నారు.

- మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన కార్యక్రమంలో తెవివే రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, యూటీఎఫ్ నాయకులు బక్కా శ్రీనివాసాచారి, డీటీఎఫ్, గణేష్, జేవీవీ కందుకూరి సుదర్శన్, ప్రజాస్వామ్య పరిరక్షణ సమితి ఖాదర్, భారత్ బచావో ఉదయ పాల్గొన్నారు.
- ప్రొఫెసర్ సాయిబాబాది ముమ్మాటికీ హత్యేనని మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు అన్నారు. ఆయన చావుకు ప్రభుత్వాలు కుట్ర పన్నాయని, ఆ కుట్రలో మనమందరం భాగస్వాములమేనని అన్నారు. ఆయన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశారని కొనియాడారు.
- నల్లగొండ పట్టణంలోని క్లాక్‌టవర్ సెంటర్‌లో గల అమర వీరుల స్తూపం వద్ద ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక బాధ్యులు సుధాకర్‌రెడ్డి, పన్నాల గోపాల్‌రెడ్డి, గురవయ్య, పర్వతాలు, శంకరయ్య, పి.వెంకులు, అనంతరెడ్డి, మేక రాంరెడ్డి, జానకీరాంరెడ్డి, ఇందూరు సాగర్, పరిపూర్ణచారి, విజయ్ కుమార్, రాములు, పందుల సైదులు, రంజిత్, నాగయ్య, జగతి, ప్రసాద్, ఏడుకొండల్ తదితరులు పాల్గొన్నారు.
- నార్కట్‌పల్లిలో సాయిబాబా మృతిపట్ల కేవీపీఎస్ మండల అధ్యక్షుడు దండు రవి నివాళులర్పించారు.
- మానవ హక్కుల ఉద్యమ నేత మేధావి ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం సంతాపాన్ని తెలిపారు.


నల్లగొండ: కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, అక్టోబరు 13: ఎమ్మెల్యే నేనావాత్ బాలునాయక్ శనివారం హైదరాబాద్‌లో దసరా సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయన బోకెను అందజేసి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట నియోజకవర్గ నాయకుడు సిరాజ్‌ఖాన్ ఉన్నారు.


సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఆంజనేయస్వామికి ఎంపీ చామల పూజలు

చిట్యాలరూరల్, అక్టోబరు 13: చిట్యాల మండలం వెలిమినేడులోని శ్రీఆంజనేయ స్వామి దేవాలయలంలో దసరా సందర్భంగా శనివారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబసభ్యులతో ఆయన ఆంజనేయస్వామిని దర్శించుకోగా పురోహితుడు వల్లూరి నిఖిల్‌శర్మ పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా రోజున ఆంజనేయస్వామిని కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఎంపీని యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి అరూరి శ్రీశైలం కలిశారు. ఆలయ పూజారి వల్లూరి నిఖిల్‌శర్మ ఎంపికి శా లువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ జూనియర్ అసిస్టెంట్ నన్నూరి మల్లారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


స్వామివారికి నమస్కరిస్తున్న ఎంపీ కుటుంబసభ్యులు

వైన్స్ దుకాణంలో రూ.10.84లక్షలు చోరీ

● రేకులు ధ్వంసం చేసి దుకాణంలోకి చొరబడిన వైనం

గుర్రంపోడు, అక్టోబరు 13: విజయదశమి పర్వదినం, తెల్లారితే ఆ దివారం... వరుస సెలవులతో బ్యాంకులో జమ చేయాల్సిన నగదును దుకాణంలో ఉంచటంతో రాత్రివేళ ఓ నిందితుడు చోరీ చేశాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్రంపోడు మండల కేంద్రంలోని ఆదిత్య వైన్స్‌లో ఈ సంఘటన జరిగింది. వైన్స్ దుకాణంలోని గల్లాపెట్టెలో ఉంచిన రూ.10.84 లక్షల నగదు అపహరణకు గురైంది. ఎస్ఐ నారాయణరెడ్డి తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గుర్రంపోడు మండల కేంద్రంలోని ఆదిత్య వైన్స్ నిర్వాహకులు రాత్రి 8 గంటల సమయంలో దుకాణాన్ని మూసివేశారు. మద్యం విక్రయించగా వచ్చిన నగదును దుకాణంలోని గల్లాపెట్టెలోనే ఉంచివెళ్లారు. ఆదివారం ఉదయం 10గంటలకు దుకాణాన్ని తెరిచిన నిర్వాహకులకు పైన రేకులు తొలగించి ఉండటం, గల్లాపెట్టెలో ఉంచిన రూ.10.84 లక్షల నగదును చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీసీ కెమెరాలో నమోదైన ఫుటేజీని గమనించగా, అర్ధరాత్రి 1.22 గంటల సమయంలో గుర్తు తెలియని నిందితులు దుకాణంపైన ఉన్న రేకులను ధ్వంసం చేసి అందులోకి ప్రవేశించినట్లు గుర్తించారు. మూతికి వస్త్రం కట్టుకున్న ఓ వ్యక్తి గల్లాపెట్టెలో ఉన్న రూ.10.84లక్షల దోచుకెళ్లినట్లు వైన్స్ నిర్వాహకుడు పొనుగోటి నర్సింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.


చోరీ చేసిన దుకాణంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

సంక్షిప్త సమాచారం...

మిర్యాలగూడ టౌన్: సమగ్ర కులగణన చేపట్టడం హర్షనీయమని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం మాట్లాడుతూ 60 రోజుల్లో సమగ్ర కులగణన చేపట్టాలని రాష్ట్రప్రభుత్వం జీవో జారీ చేయడం గొప్ప విషయమన్నారు. బీసీలకిచ్చిన మాటను నిలబట్టుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

చండూరు రూరల్: చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన సుంకరి చంద్రశేఖర్‌గౌడ్ తన వంతుగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు రూ.10 వేలు అందజేశారు.

శాలిగౌరారం: జిల్లా కోర్టులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన వేముల రంజిత్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అతని ఎంపికపై గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు జహంగీర్ హర్షం వ్యక్తం చేశారు.

మిర్యాలగూడ టౌన్: పట్టణానికి చెందిన ఆటోవాలా యూసుఫ్ ఔదార్యం చాటుతున్నాడు. దసరా సందర్భంగా జమ్మిపూజకు వచ్చే భక్తులకు ఉచితంగా తాగునీటిని అందజేశాడు. పట్టణంలోని తాళ్లగడ్డలో నివసించే యూసుఫ్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఐదేళ్లుగా ప్రతీ దసరాకు తాగునీటిని అందిస్తున్నాడు.

చిట్యాల: మునిసిపాలిటీ పరిధిలోని శివనేనిగూడెం గ్రామానికి చెందిన గౌతమి భర్త సుధాకర్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. 2007-08 ఎస్ఎస్‌సీ బ్యాచ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆమె కుటుంబానికి రూ.35వేలు సేకరించి ఆదివారం అందజేశారు. ఆపదలో ఉన్న క్లాస్‌మేట్ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో శివ, నరేష్, మాధవి, నర్మద, అనిత, ధనమ్మ పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: చిట్యాల మండలంలోని ఆరెగూడెంలో శ్రీకనకదుర్గ అమ్మవారి లడ్డూ వేలంలో రూ.2.32 లక్షలకు గ్రామస్థుడైన అరూరి గోపాల్ దక్కించుకున్నాడు.

ఓంకార్ వర్ధంతి సభను జయప్రదం చేయాలి

మిర్యాలగూడ, అక్టోబరు 13: ఎంసీపీఐ(యూ) వ్యవస్థాపకుడు మద్దికాయల ఓంకార్ 16వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వస్కుల మట్టయ్య అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఓంకార్ వర్ధంతి సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆత్మకూరు మండలం ఏపూరులో జన్మించిన ఓంకార్ భూస్వాములకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో పాల్గొన్నారని అన్నారు. 1984లో ఎంసీపీఐ(యూ)ను స్థాపించి మరణించేంత వరకు కమ్యూనిస్టుగా ప్రజల పక్షాన పనిచేశారని అన్నారు. ఈ నెల 17వ తేదీన వర్ధంతి సందర్భంగా వరంగల్ జిల్లా మచ్చాపురంలో ఆయన స్థూపం వద్ద మార్క్సిజం, అంబేడ్కర్ ఆలోచనా విధానం అనే అంశంపై జరిగే సభ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, సహాయ కార్యదర్శి పోతుగంటి కాశీ, జిల్లా నాయకులు భరత్, కిరణ్, జ్యోతి, పద్మ, మహేష్, కార్తీక్, సందీప్, మౌనిక పాల్గొన్నారు.

భగవద్గీత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

హాలియా, అక్టోబరు 13: ప్రతి ఒక్కరూ భగవద్గీత జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రామ్‌లక్ష్మణ్‌దాస్ ప్రభు అన్నారు. హాలియా మునిసిపాలిటీలో ఆదివారం హరే కృష్ణ వారి ఆధ్వర్యంలో భక్తి యోగా కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సాగర్ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికి భగవద్గీత జ్ఞానాన్ని అందించడం, అన్ని గ్రామాల్లో ఇంటింటికి భగవద్గీత అందించటమే మా కర్తవ్యమని అన్నారు. అదే విధంగా మునిసిపల్ చైర్‌పర్సన్ గౌరవ సలహాదారుడు యడవల్లి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తి యోగా కేంద్రాన్ని హాలియాలో ప్రారంభించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.శ్రీనివాస్, డాక్టర్ కోటిరెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, యోగా మాస్టర్ ఎండీ జానీ, చామకూరి లింగారెడ్డి, అనిల్ రెడ్డి, జయవర్ధిని, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.